కర్నూలు । నంద్యాల
వార్త
3 ఫిబ్రవరి 2026 మంగళవారం పేజీలు 4

# ఫిబ్రవరి 7న ఎమ్మిగనూరు కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాక..

**: ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు**
**: రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ**



**కర్నూలు, ఫిబ్రవరి2 ప్రభాతవార్త :** 7వ తేదీన ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు.సోమవారం కలుగొట్ల గ్రామంలో కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జాయింట్ కలెక్టర్ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డిఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ అలాగే సంబంధిత శాఖల అధికారులతో కలిసి సీఎం పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్, ప్రజా వేదిక, రైతులతో ముఖాముఖి కార్యక్రమాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియా తో మాట్లాడుతూ... ఫిబ్రవరి 7వ తేదీన కలుగొట్ల గ్రామంలో నిర్వహించనున్న పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారని తెలిపారు.

# బెల్ట్.. తీస్తారా..!?

- : జోరుగా మద్యం అక్రమ విక్రయాలు
- : బరి తెగిస్తున్న అక్రమార్కులు
- : సీఎం ఆదేశాలు బేఖాతర్
- : మామూలు (మత్తు) లో ఎక్సైజ్ శాఖ..?
- : గణతంత్ర దినోత్సవంలో ను జోరుగా బెల్టు షాపులు
- : స్పందించని ఎక్సైజ్ శాఖ అధికారులు
- : ప్రభుత్వం స్పందించాలని ప్రజలు విన్నపం





**గ్రామాలు, పట్టణాల్లో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే సహించేది లేదు.. ఎవరైనా బెల్టు షాపు పెడితే బెల్టు తీస్తాం. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా ఎవరూ నడుచుకోవద్దు. అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పదేపదే హెచ్చరిస్తున్న సంగతి తెలిసిందే. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం కొంతమంది అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ఇష్టారాజ్యంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్‌శాఖాధికారులు మామూళ్లు (మత్తు) లో జోగుతున్నారనే విమర్శలున్నాయి. దీంతో మద్యం అక్రమ విక్రయదారులు, బెల్టు షాపుల నిర్వాహకులు యథేచ్ఛగా తమ దందా కొనసాగిస్తున్నారు.**

**ఎమ్మిగనూరు ఫిబ్రవరి 02, ప్రభాతవార్త :** గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ వెనుక కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు ఉన్నారనే ఆరోపణలున్నాయి. వారి మద్దతుదారులే బెల్ట్ దుకాణాలను నిర్వహిస్తున్నారనే వ్యాఖ్యలు లేకపోలేదు. బహిరంగంగానే బెల్టు దుకాణాలు..! గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బెల్ట్ షాపు నిర్వాహకులు ఒక్కో మద్యం బాటిల్‌పై రూ.20 అదనంగా వసూలు చేసి విక్రయాలు సాగించేవారు. రాత్రి పది గంటలు దాటిన తర్వాత సీసాపై రూ.30 పెంచి విక్రయాలు చేపట్టేవారు. బహిరంగంగానే బెల్ట్ దుకాణాలు నిర్వహించినా.. నాడు ఎక్సైజ్ అధికారులు ఏమి చేయలేని పరిస్థితి. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బెల్టుపై సీరియస్‌గా ఉండడంతో కొందరు గుట్టుచప్పుడు కాకుండా తమ దందా కొనసాగిస్తున్నారు. బెల్టు దుకాణాల్లో ప్రతి మద్యం బాటిల్ పై అదనంగా వేసుకొని విక్రయాలు జరుపుతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు నిర్వహిస్తూ.. రెండు చేతులా సంపాదిస్తున్నారు.

**అక్కడ తెల్లవారు జామునే మద్యం విక్రయాలు..!**

ఎమ్మిగనూరు పట్టణంలోని కర్నూలు బైపాస్ రోడ్డు స్మశాన వాటిక ఎదురుగా ఉన్న ఓ మద్యం దుకాణం పక్కనే ఇందిరా నగర్ కాలనీ కి చెందిన ఓ వ్యక్తి బెల్టు దుకాణం ఏర్పాటు చేసి బహిరంగంగానే అక్రమంగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. బెల్టు షాపులకు సిట్టింగ్ లు ఏర్పాటు చేసి యధేచ్ఛగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ మాత్రం అటువైపు కన్నెత్తి..

• వివరాలు 2లో

## మహాశివరాత్రి పర్వదిన వేడుకలను..
# సమన్వయంతో.. విజయవంతం చేయాలి..!

**: భక్తులకు సంతృప్తికరమైన దర్శనం కల్పించాలి**
**: అధికారులను ఆదేశించిన మంత్రుల బృందం**

**శ్రీశైలం ప్రాజెక్టు ఫిబ్రవరి2, ప్రభాతవార్త :** శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా, భక్తి పారవశ్యంతో సజావుగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీశైలంలోని సదాశివయ్య భవన్‌లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎక్స్ ఆఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కలిసి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, శ్రీశైలం, ఆత్మకూరు డీఎఫ్‌వోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, మహాశివరాత్రి పర్వదిన వేడుకల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వహణ, దర్శన ఏర్పాట్లు, వసతి, భద్రత, పారిశుద్ధం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. గత సంవత్సరం ఎదురైన లోపాలను సవరించడంతో పాటు, సంభవించే సమస్యలను ముందుగానే అంచనా వేసి పరిష్కార మార్గాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఎస్‌ఓపీని ఆధారంగా చేసుకొని అన్ని ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్‌కు శ్రీకారం చుట్టేందుకు..

• వివరాలు 2లో




## అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి పునరంకితం కావాలి

-రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త ప్రతినిధిః** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పార్టీకి అసలైన బలం మరియు ప్రాణవాయివు అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటి ఉండి నడిపించిన కార్యకర్తలకు ఎల్లప్పుడు సముచిత స్థానం ఉంటుందని వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు. నంద్యాల నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేస్తు పార్టీ బలోపేతానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

## మీ భూమి మీ హక్కు పట్టాదారు పాసుబుక్కుల పంపిణి



**ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్తః** ఆళ్లగడ్డ మండల పరిధిలోని ఎస్ లింగందిన్నె గ్రామంలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మీ భూమి మీ హక్కు పట్టాదారు పాసుబుక్కులు పంపిణి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పబ్లిసిటి కోసం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పాసు బుక్కులపై, సర్వే రాళ్ళపై ఎక్కడ పడితే అక్కడ ఆయన బొమ్మ వేసుకొని ప్రజల సొమ్మును వృదాచేయడం జరిగిందన్నారు. మన ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అలా కాకుండా పట్టా పాసు బుక్కు మీద రాజముద్ర వేయించి రైతులకు ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డోలు విద్వాంసుడుని సన్మానించిన బైరెడ్డి సిద్దార్థరెడ్డి



**నందికొట్కూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** పట్టణంలో దాదాపు 250 మందికి డోలు విద్యా దానకర్త ఆంధ్రా స్టార్ గ్రహీత శ్రీశైల దేవస్థాన ఆస్థాన్ విద్వాన్ దామగట్ల స్వాములు ను సోమవారం వైసిపి రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రసిడెంట్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా చిన్న మల్లారెడ్డి, కౌన్సిలర్ కృష్ణ, స్తానిక వైసిపి నాయకులు, చిన్నారులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై చట్టపరమైన విచారణ

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 125 ఫిర్యాదులు**



**కర్నూలు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల వినతులను ఎస్పీ స్వయంగా స్వీకరించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి మొత్తం 125 ఫిర్యాదులు అందాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అన్ని ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ డీఎస్పీ బాబు ప్రసాద్‌తో పాటు సీఐలు శివశంకర్, రమేష్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి.. 30 రోజులు జైలు శిక్ష..!

**- 30 రోజులు జైలు శిక్ష విధిస్తూ జడ్జి ఆదేశం**



**ఆదోనిటౌన్, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త :** ఆదోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భీమ్‌సింగ్ అనే వ్యక్తి మద్యం సేవించి బొలెరో వాహనాన్ని నడుపుతూ పట్టుబడినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. సదరు వ్యక్తిని సోమవారం కోర్టులో హాజరు పరచగా, ఫస్ట్ అడిషనల్ జేఎఫ్‌సీఎం జడ్జి 30 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమన్నారు. వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అజాగ్రత్తగా నడపడం వల్ల ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఎప్పటికప్పుడు వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు చేపడతామన్నారు. ముద్దాయి భీమ్‌సింగ్‌ను సబ్‌జైలుకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామ్‌నాథ్, కానిస్టేబుల్ సురేష్ ఉన్నారు.

## అర్జీదారులు సంతృప్తి చెందేలా.. పరిష్కారం

**: పీజీఆర్ఎస్ అర్జీలు నిర్ణీత గడువులో పరిష్కరించాలి**
**: రెవెన్యూ క్లినిక్ అర్జీలపై ప్రత్యేక దృష్టి**

**కర్నూలు, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త :** అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ – పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను నాణ్యతతో, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు. ఏ ఒక్క అర్జీ కూడా ఎస్ఎల్ఏ దాటకూడదని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీలు రీ–ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ఎట్ టు వ్యూ లేకుండా అర్జీలను నిరంతరం పర్యవేక్షించాలని, అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని, ఇచ్చే ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌తో పాటు రెవెన్యూ క్లినిక్ ద్వారా వచ్చిన అర్జీలను కూడా సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ ద్వారా మొత్తం 238 అర్జీలు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ క్లినిక్‌కు సంబంధించినవి 136 అర్జీలుగా నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఆళ్లగడ్డలో.. ఉద్రిక్తత..!

**- ఎమ్మెల్యే - ఎవిల మధ్య ఘర్షణ**



**ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్తః** ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఎవి సుబ్బారెడ్డిల మధ్య ఘర్షణలతో ఆళ్లగడ్డలో ఉద్రిక్తత ఏర్పడింది. సోమవారం ఆళ్లగడ్డ పట్టణం పాత బస్టాండ్ సమీపంలోని ఎవి సుబ్బారెడ్డి కాంప్లెక్స్‌కు కర్ణమయ్య వీధికి మధ్య వున్న సీసీ రోడ్డుపైన అడ్డంగా కట్టిన రోడ్డును టౌన్‌ప్లానింగ్ అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తొలగించారు. విషయం తెలుసుకున్న ఎవి సుబ్బారెడ్డి అక్కడికి చేరుకోవాలన్న ప్రయత్నంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ ఉధృతమవుతుందని ప్రజల భయాందోళన చెందారు. ఈపాటికే అక్కడికి చేరుకున్న డిఎస్పీ ప్రమోద్, సిఐ యుగంధర్‌లు తమ సిబ్బందితో ఇరువర్గాలు ఎదురుపడకుండా ఎవి సుబ్బారెడ్డిని పాత బస్టాండ్ వద్దనే అపి ఘర్షణ వాతావరణాన్ని సద్దుమనిపించారు. ఈసందర భంగా ఎవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ సదరు కాంప్లెక్స్‌కు సంబంధించి తన వద్ద డాక్యుమెంట్లు ఉన్నాయని తమకు నోటీసులు ఇవ్వకుండా కాంప్లెక్స్‌కు సంబంధించిన గోడను ఎలా పడగొడతారని ప్రశ్నించారు. ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సోదరుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డిల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసంఘటనలన్ని పార్టీ అదిష్టానం దృష్టికి తీసుకెళ్లి వివరిస్తామన్నారు. తమ అనుచరులు, కార్యకర్తలు తొందరపడి ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన తెలిపారు.

## శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వార్లను మంత్రులు





**శ్రీశైలం ప్రాజెక్టు ఫిబ్రవరి2, ప్రభాతవార్త :** ఆనం నారాయణరెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మంత్రులు ఆనం నారాయణరెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి,వంగలపూడి అనిత ఆలయ మర్యాదల అనుసరించి ఆలయ ఈవో శ్రీనివాసరావు,అర్చకులు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవారిని దర్శించుకొని మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో మంత్రులు ఆనం నారాయణరెడ్డి,బీసీ జనార్దన్ రెడ్డి వంగలపూడి అనిత ఆలయంలో మహిళా భక్తులతో కాసేపు ముచ్చటించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ చైర్మన్ రమేష్ నాయుడు,ఈవో శ్రీనివాసరావు చిత్రపటం స్వామి అమ్మవారి తీర్థ ప్రసాదాలు శేష వస్త్రాలు మంత్రులకు అందజేశారు.



## నమస్తే.. ఆదోని..!

**: ఆదోనిలో ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్ కలకలం: : పోలీసులకు వైసీపీ నేతల ఫిర్యాదు**



**ఆదోని క్రైమ్ ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** సోషల్ మీడియాలో వైసీపీ నాయకుల పై సాగుతున్న అసభ్య ప్రచారాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఆదోని టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఖినమస్తే ఆదోనిఖి అనే ఫేక్ అకౌంట్ ద్వారా మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సహా పలువురు నేతలపై అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని పట్టణ అధ్యక్షుడు దేవా, మహిళా నేత శ్రీలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ గౌరవానికి భంగం కలిగిస్తున్న నిందితులను సాంకేతిక ఆధారాలతో గుర్తించి కఠినంగా శిక్షించాలని పోలీసులకు విన్నవించారు. నాయకులను గౌరవించకపోయినా పర్వాలేదు కానీ, ఇలా అసభ్యకరంగా పోస్టులు పెడితే ఊరుకునే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.“

# పులికనుమ నుంచి ఎల్లెల్సీఆయకట్టు రైతులకు నీటి విడుదల

**: పొనకలదిన్నె,డీపీ 86కాలువ కింద పంటలకు ఊరట : రెండు రోజుల నీటి విడుదల చేసిన అధికారులు**



**గోనెగండ్ల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** గోనెగండ్ల ఎల్లెల్సీ కాలువ కింద సాగుచేసిన పంటలు ఎండిపోతుండటంతో వాటిని ఆదుకునేందుకు గాను అధికారులు సోమవారం పులికనుమ నుంచి గోనెగండ్ల ఎల్లెల్సీ ఆయకట్టు పంట పొలాలకు నీరు విడుదల చేశారు. దీంతో ఎల్లెల్సీ ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లెల్సీ కాలువ 267 కిలోమీటర్ల దగ్గర పులికనుమ నుంచి నీటిని ఎల్లెల్సీ కాలువ లోకి నీటిని విడుదల చేశారు. ఈనీరు గోనెగండ్ల సెక్షన్‌లోని పొనకలదిన్నె కాలువ, డీపీ 86కాలువల కింద పంటలు సాగు చేసుకున్న రైతుల కోసం నీటిని విడుదల చేసినట్లు ఎల్లెల్సీ అధికారులు తెలుపుతున్నారు. గత నెల 15వ తేదిన తుంగభద్ర డ్యాం నుంచి నీటి విడుదల నిలిచి పోయింది. దీంతో ఎల్లెల్సీ కింద ఆయకట్టు రైతులు సాగు చేసుకున్న పంటలు ఎండిపోతున్నాయని గోనెగండ్ల ఆయకట్టు రైతులు గత 10 రోజుల క్రితం సెక్షన్ కార్యాలయం దగ్గర నిరసన తెలిపారు. పులికనుమ నుంచి నీటిని విడుదల చేయాలని రైతులు ఇరిగేషన్ అధికారులను కోరారు. ఇందు స్పందించిన అధికారులు పులికనుమ నుంచి సోమవారం 15 నుంచి 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. విడుదల అయిన నీటిని గోనెగండ్ల నుంచి సెక్షన్ నుంచి పొనకలదిన్నె కాలువ, డీపీ86 కాలువల కింద సాగు చేసుకున్న పంటలకు విడుదల చేశారు. రెండు రోజుల పాటు నీటి విడుదల కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

**–గంగమ్మ పూజ చేసిన గోనెగండ్ల టీడీపీ నాయకులు–:**

సోమవారం పులికనుమ నుంచి గోనెగండ్ల ఎల్లెల్సీ ఆయకట్టు పంట పొలాలకు నీరు విడుదల చేసినందు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డా.బీవీ జయనాగేశ్వరరెడ్డికి గోనెగండ్ల రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లెల్సీ నీటిని గంగపూజ నిర్వ హించిన గోనెగండ్ల టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, టామట ఉసేన్, నజీర్‌సాహెబ్, బేతాళ బడేసాహెబ్, మాజీ సర్పంచ్ రంగముని, మురళినాయుడు, ఫకృద్దీన్, కౌలుట్లయ్య, మదీన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సి.యస్.ఐ.పాలెంలో నాటుసారా పట్టివేత



**నందికొట్కూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్‌శాఖ అధికారి ఎస్.రవికుమార్ ఆదేశాల మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సి.ఐ.రామాంజనేయులు ఆధ్వర్యంలో పట్టణంలోని సి.యస్.ఐ. పాలెంలో సోమవారం సోదాలు నిర్వహించగా బొల్లవరం సాగర్ ఇంటివద్ద 12 లీటర్ల నాటుసారా పట్టుకున్నట్లు సి.ఐ.తెలిపారు. విఆర్వో సి.వెంకట రమణ, తలారి మహేష్, ఎక్సైజ్ సిబ్బంది పంచనామా అనంతరం కేసు నమోదు చేసినట్లు ఆయనన తెలిపారు. ఎస్సై జఫరుల్లా, హెడ్‌కానిస్టేబుల్ పి.పద్మనాభం, ఎం.కె.శేఖర్ నాయుడు, ఎం.శివన్న, పి.సంధ్యారాణి పాల్గొన్నారు.

## శ్రీపక్కీరప్ప తాత రథం కోసం రూ.50 వేలు విరాళం



**ఆస్పరి,ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఆస్పరి గ్రామంలో శ్రీపక్కీరప్ప తాత నూనత ఉత్సవం కోసం రూ. 50 వేలు ఆలూరు జనసేన పాఆర్టీ ఇన్‌చార్జ్ తెర్నెకల్ వెంకప్ప విరాళంగా అందజేసినట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అరవింద్, ఏపి కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. వారు మాట్లాడుతు 2025 డిసంబర్ 13న ఆస్పరి గ్రామ పర్యటన సంధర్భంగా ఆలూరు జనసేన పార్టీ ఇంచార్జ తెర్నెకల్ వెంకప్ప గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ తదితర మౌళి వసతుల సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అ సమయంలో పక్కీరప్ప తాత గుడి పెద్దలు ఆలయానికి రథం ఏర్పాటు నిమిత్తం చందా కోరగా వెంటనే స్పంధించిన వెంకప్ప చందా పుస్తకంలో రూ. 50 వేలు రాసి మాట ఇచ్చారు. దాని ప్రకారం పక్కీరప్ప తాత గుడి పెద్దలు రామాంజనేయులుకి రూ.50 వేలు నగదును సోమవారం అందజేశారు. సమాజసేవ, ప్రజా సమస్యల పరిష్కారం మరియు ధార్మిక కార్యక్రమాలకు అండగ నిలుస్తున్న వెంకప్ప సేవాబావాన్ని గ్రామ ప్రజలు అభినంధించారు. జనసేన పార్టీ నాయకులు పూజారి శ్రీనువాసులు, పూజారి శివ, మహేష్, వినోద్, సునీల్ పాల్గొనగా, గుడి పెద్దలు వీరభద్రి, ఉరుకుందు, గోవిందప్ప, మురళీ హాజరయ్యారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**తుగ్గలి,ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి రైతు విభాగపు జిల్లా ఉపాధ్యాక్షుడు మనోహార్ చౌదరి, టిడిపి నాయకులు గోవిందురెడ్డి, కృష్ణమూర్తి చౌదరి, మైరాముడు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని రాతన గ్రామంలో నూతన పట్టదారు పాసు పుస్తకాలను ఆర్.ఐ.వెంకట్రాముడు, వీఆర్వో నాగేంద్ర రైతులకు పంపిణి చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు గత ప్రభుత్వ హాయాంలో జగన్ పాసుపుస్తకాలపై పోటోలు వేయించుకొని మీ భూములను కాజేసేందుకు ప్రయత్నం చేసిందని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ హాయాంలో ముద్రించిన పాసుపుస్తకాలను రద్దు చేసి రాజముద్రతో కూడిన పట్టాదారు పుస్తకాలను కూటమి ప్రభుత్వం అంధించడం జరిగిందన్నారు. మీ ఆస్తులు మీ పేరు మీదనే ఉండాలనే ఉద్దేశ్యంతో మీ భూములను కాపాడడం జరిగిందన్నారు. బీఆర్వోలు రెహామాన్, రంగన్న, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోవాలి



**తుగ్గలి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** విద్యార్థులు నేటి సమాజంలో చదువుపై ఆసక్తి పెంచుకోవాలని ఎంఈఓ రమా వేంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని జొన్నగిరి గ్రామానికి చెందిన జూటూరు స్వర్ణకుమారి (ఎస్జీటి) టీచర్ పుట్టిన రోజు, ప్రభుత్వ ఉద్యోగ ప్రవేశం సంధర్భంగా జొన్నగిరి, రోల్లపాడు, తండా, పగిడిరాయి, దేశాయి తండాలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎంఈఓ రమా వెంకటేశ్వర్లుతో కలిసి పలకలు, పెన్నులు, పెన్సిళ్ళు ఉచితంగా పంపిణి చేశారు. ఎంఈఓ మాట్లాడుతు విద్య చీకటి అనే ఆజ్ఞానం నుండి విజ్ఞానం అనే వెలుగులోకి నడిపిస్తుందన్నారు. స్వర్ణకుమారి తన చిన్నతనం నుండి చదివిన పాఠశాలలోని విద్యార్థులకు పలకలు,పెన్సిళ్ళు ఇవ్వడం చాల సంతోషకరంగా ఉందన్నారు.. అనంతరం ఎంఈఓ ఆమె అభినంధించారు. సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రోల్లపాడు వెంకటేష్, సతీష్, నాగేష్,. నాగభూషణం, మల్లన్న పాల్గొన్నారు.

## కురుకుంద గ్రామంలో నీటి కష్టాలను తీర్చండి

**– కలెక్టర్ వినతి**



**ఆలూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** ఆలూరు మండలం కురుకుంద గ్రామంలో గత రెండు సంవత్సరాలుగా త్రాగడానికి నీరు లేక అల్లాడి పోతున్నామని, రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి సమస్యను పరిష్కారించాలని హెబ్బటం నుండి నీటిని అంధించాలని గ్రామస్తులు ఎంపిడిఓ ద్వారా కలెక్టర్ కు సమస్యను తెలియజేశారు. ఇప్పటి వరకు పోలాలలో ఉన్న ఇంకుడు గుంతలలో నిలువు ఉన్న వర్షపు నీటిని తెచ్చుకొని త్రాగుచున్నామని, అధికారులు గ్రామానికి నీరు ఇస్తున్నామని చెబుతున్నారే కానీ వారు ఇచ్చే నీరు గ్రామ సచివాలయం దగ్గర ఉన్న ఒక్క పాయింట్ దగ్గర మాత్రమే సరిపోతున్నాయని, కావున ఇప్పటికైనా అధికారులు స్పంధించి కురుకుంద గ్రామానికి ప్రక్కనే ఉన్న హెబ్బటం నుండి మాకు నీరు అంధిస్తే నీటి సమస్య లేకుండా ఉంటుందని, ఇప్పటికి మా ఊరిలో ఒక్కోక్క కుటుంబం రోజుకు రూ.30 లు పెట్టి నీటిని కొని తాగవలసి పరిస్థితి మాది. 20 సంవత్సరాలుగా మాకు హెబ్బటం నుండి నీరు అంధించండి అని ఎన్ని సార్లు అధికారులకు మొర పెట్టుకున్న పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం ఎనిమిది కిలో మీటర్ల దూరంలో ఉన్న హెబ్బటం నుండి నీళ్ళను ట్రాక్టర్ల ద్వారా, ద్విచక్ర వాహానాలు, తోపుడుబండ్ల ద్వారా తెచ్చుకొని తాగుతున్నామని, కావున ఇప్పటికైన జిల్లా కలెక్టర్ స్పంధించి వెంటనే కురుకుంద గ్రామస్తుల నీటి కష్టాలను తీర్చాలని గ్రామస్తులు కోరారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శిస్తే సహించం..!



**పెద్దకడబూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని వ్యక్తిగతంగా సభ్య సమాజం తలదించుకునేలా వైసిపి నేత మాజీమంత్రి ఉమ్మడి రాంబాబు దారుణంగా విమర్శించడం సహించమని టిడిపి మండల కన్వీనర్ జి మల్లికార్జున అన్నారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ఎంతోకృషి చేస్తున్నా తమనేత చంద్రబాబుపై ఇష్టానుసారంగా విమర్శించడం వల్లే టిడిపి కార్యకర్తలు అంబటి రాంబాబు కు తగిన బుద్ధి చెప్పారు అన్నారు వైసిపి నేతలు చేతనైతే రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఇలా దిగజారి విమర్శలు చేస్తే ప్రజలే మరోసారి బుద్ధి చెప్తారన్నారు.

## వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక



**పెద్దకడబూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** మండల పరిధిలో కల్లుకుంట గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలు టిడిపి నేత నరవ రమాకాంత్ రెడ్డి నరవ శశిరేఖల సమక్షం లో సోమవారం ఎస్సీ కాలనీకి చెందిన వైసిపి కార్యకర్తలు ఉరుకుందప్ప, ఈరన్న, మల్లికార్జున, శేఖర్, నల్లన్న, లక్ష్మన్న, జాను, మారెమ్మ, రఘు, ఈరన్న అబ్రహం, టిడిపిలో చేరారు వీరికి టిడిపి కండువాలు వేసి పార్టీ లోకి ఆహ్వానించారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసిపి కార్యకర్తలు తమ పార్టీలోకి రావడం జరిగిందని వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు రాష్ట్రంలో వైసీపీ నాయకులు రోజురోజుకు దిగజారి మాట్లాడుతున్నారని ప్రజలే వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు కాలనీలో టిడిపి అభివృద్ధికి టిడిపి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. మండల టిడిపి నాయకులు మీసేవ ఆంజనేయులు మల్లికార్జున నరసింహారెడ్డి పాల్గొన్నారు

## ఈ నెల 12న అంగన్వాడీల దేశవ్యాప్త సమ్మె



**నందికొట్కూరు,ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** ఈ నెల 12న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు సిఐటియు నాయకులు తెలిపారు. సోమవారం సిఐటియు పట్టణ కార్యదర్శి టి. గోపాలకృష్ణ, అంగన్వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ నాయకులు డి.మదార్‌బీ, బి.లక్ష్మి, కళావతి ప్రాజెక్టు సి.డి.పి.ఓ. మంగవల్లి ని కలిసి సమ్మె నోటీసును అందజేశారు. వారు మాట్లాడుతు అంగన్వాడీ వర్కర్స్‌కు కనీస వేతనం రూ..26 వేలు నిర్ణయించి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్డ్ అయిన వారికి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి చట్టం అమలు చేయాలని, తదితర సమస్యల పరిష్కరినికై 12న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వారు పిలుపు నిచ్చారు. వెంకటలక్ష్మి, కృషిద్బీ పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ అడంగల్ వన్ బి పసు పుస్తకాల సమస్య పరిష్కరించాలి



**మిడుతూరు,ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** మండల పరిదిలోని రైతులకు సంభంధించిన భూముల అన్‌లైన్ అడంగల్ వన్ బి పాసు పుస్తకాల సమస్యలను వెంటనే పరిష్కారించాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ధర్న చేసి తహాసిల్దార్ శ్రీనువాసులు కు వినతి పత్రం అందజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతు మండలంలో 19 గ్రామ పంచాయితీలు, నాలుగు మజరా గ్రమాలు ఉన్నాయని దాదాపు 9 గ్రామాలలో రీ సర్వే పూర్తి అయిందన్నరు. ఇంకా మిగితా గ్రామాలలో సర్వే చేయాల్సి ఉందని, సర్వే పూర్తి అయిన గ్రామాలలో కూడా రైతుల సమస్యలు అనేకం ఉన్నాయని, చెరుకుచెర్ల, సుంకేసుల, ఉప్పలదడియా, మాసపేట, జలకనూరు, అలగనూరు, నాగలూటి గ్రామలలో సమస్యలు ఉన్నాయని దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదన్నారు. కావున వెంటనే రెవిన్యూ అధికారులు స్పంధించి పరిష్కారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అటవీ శాఖ ఆధ్వర్యంలో చిత్తడి నేలలపై అవగాహన



**ఆత్మకూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** చిత్తడి నేలాల దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అప్పావో ఆదేశాలతో సోమవారం మండల పరిధిలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్తడి నేలలపై విద్యార్థిని విద్యార్థులకు నాగులూటి డిప్యూటీ రేంజ్ అధికారి జాకీర్ హుస్సేన్ ఇంద్రేశ్వరం ఎఫ్ ఎస్ ఓ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ 1971 సంవత్సరంలో చిత్తడి నేలలపై అంతర్జాతీయ సదస్సు ఇరాన్ దేశంలో రాంసార్స్ లో జరిగిందని అన్నారు చిత్తడి నేలలను కాపాడుకోవడానికి అటవీశాఖ ఆధ్వర్యంలో కార్యచరణ చేపడుతున్నామని విద్యార్థులకు సూచించారు. టిడిపి పార్టీ సీనియర్ నాయకులు మహానంది రాజేంద్రారెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, అటవీ శాఖ సిబ్బంది ముర్తుజావలి, ఈదన్న, రాంబాబు, నాగమణి బాయ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల పంట పొలాలకు స్మశాన వాటికకు బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టండి



**ఆత్మకూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** ఎన్నో సంవత్సరాల నుంచి భారీ వర్షాలతో వరదలతో ఉప్పొంగి ప్రజలకు రైతులకు ఇబ్బందికరంగా ఉన్న సమస్యను తక్షణమే అధికార యంత్రాంగం పరిష్కార మార్గం చూపాలని బిజెపి పట్టణ అధ్యక్షుడు దుంపల రవీంద్రారెడ్డి సోమవారం పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయంలో జనత వారధి కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ తాసిల్దార్ ఆంజనేయులుకు ప్రజా సమస్యలపై ఫిర్యాదు అందించారు ఈ సందర్భంగా దుంపల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని గొల్లపేట సమీపంలో మరియమ్మ రస్తకు వెళ్లే రహదారులు పీతిరి వాగు ఉప్పొంగి భారీ వరదలు రావడంతో స్మశాన వాటికకు వెళ్లేందుకు ప్రజలు ఎన్నో ఇబ్బం దులకు గురవుతున్నారని అన్నారు ఇదే రహదారిలో రైతన్నలు సాగుచేసిన పంట పొలాలకు వెళ్లాలంటే రైతులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని వివరించారు ప్రజా సమస్యల్ని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వంలో తక్షణమే అధికారులు ఆ సమస్యను పరిష్కరించాలని బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుడు దుంపల రవీంద్రారెడ్డి మీడియా సమక్షంలో అధికారులకు విన్నపించారు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని డిప్యూటీ తాసిల్దార్ ఆంజనేయులు రైతులకు ప్రజలకు సానుకూలంగా భరోసా కల్పించారు వీరి వెంట బిజెపి పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు అన్వర్, గొల్లపేట రైతులు వెంకన్న, పెద్దన్న, నారాయణ, శివ, రైతులు ప్రజలు పాల్గొన్నారు

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు బిసి రాజారెడ్డికి ఆహ్వానం

**: ఫిబ్రవరి 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు యాగంటి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు**



**బనగానపల్లె, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డిని ఆలయ సిబ్బంది సోమవారం ఆహ్వానించారు. ఈమేరకు ఆలయ చైర్మన్ మోళిశ్వర్ రెడ్డి, ఈవో పాండురంగారెడ్డి లు బిసి రాజారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి బ్రహ్మోత్సవాలు హాజరుకావాలని కోరారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను బిసి రాజారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఈవో ఈనెల 14వ తేదీ నుండి 18వ తేదీ వరకు యాగంటి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 14వ తేదీ ధ్వజారోహణముతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని, 15వ తేదీ మహాశివరాత్రి, 16వ తేదీ నందికోల ఉత్సవం, 17వ తేదీ శ్రీ స్వామివారి రథోత్సవం, 18వ తేదీ శివదీక్ష విరమణ, పూర్ణాహుతి, నాగవల్లి, వసంతోత్సవం, తెప్పోత్సవం, ధ్వజ అవరోహణముతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని బిసి రాజారెడ్డి ఆలయ అధికారులకు సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారని వారికి త్వరితగతిన స్వామి వార్ల దర్శనమయ్యేలా చూడాలని తెలిపారు. పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి మహేష్ శర్మ శ్రీరాములు సంగు శ్రీనివాసరెడ్డి రామశేఖర్ జక్కల సురేష్ భరతుడు వెంకట రాముడు శర్మలు పాల్గొన్నారు

## నేషనల్ డివార్మింగ్ డే విజయవంతం చేయాలి



**కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో రాష్ట్ర అదనపు డైరెక్టర్ (ఎంసిహెచ్) డా. అనిల్ కుమార్ ప్రోగ్రాం ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 17న నిర్వహించనున్న నేషనల్ డివార్మింగ్ డే సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు మాత్రలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మాతా–శిశు సంరక్షణపై దృష్టి సారించి సురక్షిత ప్రసవాలు నిర్వహించాలని, తల్లి–బిడ్డలకు అవసరమైనసేవలు, జీరో నుంచి ఐదు సంవత్సరాలవరకు టీకాలు అందించాలని తెలిపారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం, అభయ ఐడి పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

## తప్పిపోయిన పదోతరగతి విద్యార్థులు



**వెల్దుర్తి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణానికి చెందిన పదోతరగతి విద్యార్థులు ఇద్దరు(స్నేహితులు)గత 3 రోజుల నుంచి కనపడడం లేదని తల్లితండ్రులు వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. పట్టణంలోని జిల్లాపరిషత్ బాలురఉన్నతపాఠశాలలో పదోతరగతి చదివే షేక్.హుస్సేన్, షేక్.అబ్దుల్‌రహెమాన్‌లు పాఠశాలకు వెళ్లి విరామ సమయం లో బయటకు వెళ్లితిరిగి పాఠశాలకురాలేదు. ఇంటికి వెళ్లకపోవడం తో తల్లితండ్రులు ఆందోళనకు గుర్తై గత నెల 31న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లితండ్రుల ఫిర్యాదుతో వెల్దుర్తి ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు.

## తెదేపా ప్రభుత్వం.. రైతుల ప్రభుత్వం..!



**వెల్దుర్తి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** తెదేపా ప్రభుత్వం రైతుల ప్రభుత వ్వమని తెదేపా నాయకులు రత్నాపల్లి ఆనంద్‌యాదవ్ అన్నారు. బ్రహ్మగుండం రహదారిలో ఉన్న ఎర్రచెరువులో మట్టిని రైతులు సోమవారం స్వచ్ఛందంగా తమ పొలాలకు ట్రాక్టర్లలో తీసుకుపోతున్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌యాదవ్, నాయకులు వెంకటేశ్వర్లు, గోపాల్, యల్లయ్య తదితరులతో కలిసి పాత్రికేయులతో మాట్లాడారు. రైతుల పొలాల్లోకి ఈ సారవంతమైన మట్టిని తరలించేందుకు పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు అధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పించారన్నారు. దీంతో రైతులు తమ పొలాలకు మట్టి తీసుకెళ్తూ సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం సైతం ఇందుకు సంబంధించిన జీవో ఇవ్వడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మట్టిని రైతులకు ఉచితంగా ఇస్తున్నామన్నారు. రైతుల శ్రేయస్సుకై పరితపించే ఎమ్మెల్యేకు తెదేపా నాయకులు, రైతులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్ఎంపీల క్లినిక్‌ల తనిఖీ పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు

**: ఆర్ఎంపీలకు నోటీసుల జారీ**



**ప్యాపిలి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** మూడు మంచాలు ఆరు బాటిళ్ల అన్న రీతిలో ఆర్ఎంపీల దందా కొనసాగిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్ఎంపీల సమావేశాన్ని నిర్వహించి జిల్లా ఉన్నత అధికారులు హెచ్చరికలు జారీ చేసి నోటీసులను అందించారు. అయినప్పటికీ ఆర్ఎంపీలు పట్టించుకోకుండా విచ్చలవిడిగా యాంటీబ్యాటిక్, ఇంజక్షన్లు వెయ్యడం మానడం లేదని సోమవారం వైద్యాధికారుల తనిఖీలలో వెల్లడైంది. ప్యాపిలిలో సోమవారం ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్ లను ప్రభుత్వ వైద్యాధికారి రాహుల్ తనిఖీలు చేశారు. మంచాలపై పేషెంట్లకు పెట్టిన సెలైన్ బాటిళ్ళు అధికారులకు కనిపించాయి. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలకు మేరకు తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఆర్ఎంపిలకు ఎంత చెప్పినా మారడం లేదని, కఠినచర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సిఫార్సు చేస్తామని ప్రకటించారు. తనిఖీలలో ఏఎన్ఎం రాఘవేంద్ర గౌడ్, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

## బూతులు మాట్లాడిన అంబటి రాంబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలి..

**: పాలకవీటి విజయ కుమార్ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్**



**కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు మాటలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని సీఎంపై నోరు పారేసుకున్న అంబటి రాంబాబు ని కఠినంగా శిక్షించాలని.. వైసిపి లో మాజీమంత్రిగా ఉండి గౌరవ సీఎం చంద్రబాబుపై బూతులు మాట్లాడడం పై నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ మండిపడ్డారు. అంబటి రాంబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రనాయకులు రాంబాబు కీష్ణజీరావు పాల్గొన్నారు.

## 9 టీములతో ఇంటి పన్నుల వసూలు



**పత్తికొండ రూరల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** పత్తికొండ పట్టణంలో గ్రామపంచాయతీ పరిధిలో ఇంటి పన్నులు, కొళాయి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ లకు సంబంధించిన బిల్లును వసూలు కు గ్రామపంచాయతీ సిబ్బంది 9 టీంలుగా ఏర్పడి ఇంటింటికి తిరిగి పన్నులు వసూలు చేస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో నరసింహుడు తెలిపారు. పత్తికొండ పట్టణంలోని స్థానిక సంజీవ రాయ నగర్ నందు బిల్ కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ స్వర్ణ పంచాయతీ పోర్టల్ నందు ఆన్లైన్ ద్వారా పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలో మొత్తము 9777 హౌస్ హోల్డ్స్ ఉండగా ప్రస్తుతం హోటల్ ద్వారా 2977 మంది పోర్టల్ ద్వారా బిల్లులు చెల్లించారనీ ఫిబ్రవరి 14 లోపల పట్టణమంతా ఇంటింటికి తిరిగి లక్ష్యాన్ని పూర్తిచేసేలా టీములు పనిచేస్తున్నాయని అన్నారు. బిల్ కలెక్టర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మహాశివరాత్రి పర్వదిన వేడుకలను.. సమన్వయంతో.. విజయవంతం చేయాలి..!

**(మొదటి పేజీ తరువాయి ) :** ప్రభుత్వం అన్ని ఆలయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. భక్తులకు సజావుగా, సంతృప్తికరంగా దైవ దర్శనం కల్పించినప్పుడే ప్రభుత్వ చర్యలు విజయవంతమైనట్లవుతాయని స్పష్టం చేశారు. వీఐపీ, వీవీఐపీ దర్శనాలకు ప్రత్యేక స్లాట్లు కేటాయించి, నిర్ణయించిన సమయంలోనే దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అటవీ సంరక్షణ పరిధిలో ఉన్న ఆలయ ప్రాంతంలో విస్తరణ సాధ్యం కాకపోయినా, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అడవి మార్గంలో 48 కిలోమీటర్లు నడక దారిలో వచ్చే శివ భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అటవీ శాఖ అధికారులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి సమస్యలను అధిగమించాలని మంత్రి ఆదేశించారు. గత ఏడాది తరహాలోనే ఈ సంవత్సరం కూడా భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 14, 15 తేదీలలో రెండు రోజుల పాటు టోల్ గేట్ల వద్ద వాహనాలకు ఉచిత అనుమతి ఇవ్వాలని సూచించారు. రాత్రి వేళల్లో ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించాలని ఆదేశించారు. పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించే వారికి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించి, తగిన స్థలాలను కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఉత్సవాల సమయంలో సున్నా ఘటనలు జరిగేలా అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసు అధికారులకు మంత్రి ఆదేశించారు. రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా, ఘనంగా, విజయవంతంగా జరిగేలా ప్రతి శాఖ బాధ్యతతో పని చేయాలని మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి అన్నారు. ఎక్స్ఆఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ లు మాట్లాడుతూ ఈ సారి గతం కంటే 30 శాతం అధిక మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఫిబ్రవరి 8 నుంచి మార్చి 18 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఖచ్చితమైన ప్రణాళికలతో విధులు నిర్వహించేలా గత సమావేశంలో అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాధికారులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# బెల్ట్.. తీస్తారా..!?

**(మొదటి పేజీ తరువాయి ) :** చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతే కాకుండా జనవరి 26 వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా మద్య నిషేధం ఉన్నప్పటికీ యథేచ్ఛగా మద్యం విక్రయాలు నిర్వహించడం జరిగింది. ఈ విషయం పై స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారి కి ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటే ఎక్సైజ్ శాఖ పనితీరు ఏలా ఉందో ఇట్టే అర్థం చేసుకొవచ్చు అంటున్నారు పట్టణ ప్రజలు. బెల్ట్‌షాపుల నిర్వాహకులకు మీ పై ఫిర్యాదు వచ్చిందని సమాచారం లీక్ చేయడం పట్ల బెల్టు షాపులు నిర్వాహకులు, ఎక్సైజ్ శాఖ అధికారులు దోస్తీ ఎంత బలమైనదో తెలుస్తోంది.

**సీఎం చంద్రబాబు హెచ్చరికతో బెల్టుకు కళ్లెం పడేనా..?**

మద్యం మాఫియాను అరికట్టి తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందుబాటులో ఉంచాం.. మద్యం వ్యాపారంలో ఇతరుల జోక్యాన్ని సహించను. బెల్టు షాపులు పెడితే నేను కూడా బెల్టు తీయాల్సి వస్తుంది.. అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి హెచ్చరికతోనైనా బెల్టు షాపుల నిర్వాహకుల్లో మార్పు వస్తుందా..? ఎక్సైజ్ అధికారుల్లో కదలిక వస్తుందా..? ఊరూవాడా విచ్చలవిడిగా వెలసిన మద్యం బెల్టు షాపులకు తాళం పడుతుందా..? అన్నది ప్రశ్నార్థకమే.

# అమ్మవారికి పట్టువస్త్రాలను అందజేసిన కోట్ల హర్ష



**కోడుమూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** కోడుమూరు పట్టణంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ దేవి జాతర ఉత్సవాల సందర్భంగా కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం వైసీపీ శ్రేణులతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా స్థానిక వైసీపీ నాయకులు బోయ లింగమయ్య ఇంటి వద్ద నుంచి వైసీపీ శ్రేణులు ఆలయం వరకు డప్పువాయిద్యాలు,మేళ తాళాలతో భారీ ప్రదర్శన నిర్వహించు కుంటూ ఆలయంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కోట్ల హర్షకు ఆలయ ధర్మకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు గావించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జు ఆదిమూలపు సతీష్, మాజీ శాసన సభ్యులు ఎం.మణిగాంధీ, కోడుమూరు జడ్పీటీసీ సభ్యులు బరుసు రఘునాథ్‌రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ బి.రమేష్‌నాయుడు, కోడుమూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు క్రిష్ణారెడ్డి ,స్థానిక వైసీపీ నాయకులు గుజరాతి ప్రవీణ్‌కుమార్, రవికుమార్‌రెడ్డి, లక్ష్మీప్రసాద్, బోయ హనుమంతు, ఆకుల రవి, విష్ణుదాసు, జగదీష్, రవిశంకర్, మాదులు, రాఘవేంద్ర, అజయ్, ఆకుల రాము, కరెంట్ మల్లారెడ్డి, వీరన్న, కట్టెలశ్రీను, పొలకల్ ప్రభాకరరెడ్డి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

**వైసీపీ నేతల దాడులపై కోడుమూరు పి.ఎస్‌లో ఫిర్యాదు :** తిరుమల లడ్డు ప్రసాదంపై తలెత్తిన వివాదాలపై పచ్చమూకలు వైసీపీ నేతలు అంబటి రాంబాబు,జోగి రమేష్ ఇళ్లపై దాడులు సృష్టించి ప్రశాంతకు దెబ్బతీసిన సంఘటనలపై స్థానిక పోలీసులకు వైసీపీ నాయకులు ఆదిమూలపు సతీష్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆదిమూలపు సతీష్ మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. రాష్ట్రంలో వైసీపీ పార్టీని దెబ్బతీసేందుకు ఎక్కడికక్కడ దాడులకు పూనుకుంటున్నారని, వీటి వల్ల శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని, వాటిని కాపాడాల్సిన భాధ్యత పోలీసులపై ఉందన్నారు. టీడీపీ నేతల ధౌర్జన్యాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారన్నారు.

## వైభవంగా తాతలాలుస్వామి ఉరుసు ఉత్సవాలు



**క్రిష్ణగిరి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** మండల పరిదిలోని చిట్యాల గ్రామంలో వెలిసిన తాతలాలుస్వామి ఉరుసు ఉత్సవాలు సోమవారం రోజు అత్యంత వైభవంగా జరిగాయి. వేకువజాముననే స్వామి వారి ప్రతిమను స్వామి వారిని గుర్రంపై ఉంచి గ్రామంలోని ప్రధాన రహదారుల గుండా పల్లకిలో ఉంచు కొని మంగళ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామి గుర్రంను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు ఉత్సవాల సందర్భంగా కబడ్డీ పోటీలు,కడప జిల్లా యర్రగుంట్ల వారి బృందంచేత బాలబాలికలతో కట్టెల కోలెన్న కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలను భక్తులు అత్యంత వినోదంతో తిలకించారు.ఈ ఉత్సవాల కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈవేడుకల్లో పాల్గొన్న భక్తాదులకు అన్నదాన వితరణ కార్యక్రమంను దాతల సహాకారంతో ఉత్సవ కమీటీ సభ్యులు నిర్వహించారు.

## రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ



**మంత్రాలయం, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త;** మండల పరిధిలోని సింగరాజనహళ్లి గ్రామ రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ రమాదేవి, గ్రామ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షులు గోపాల్‌రెడ్డి చేతులమీదుగా ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో 868 ఎకరాల భూమి ఉండగా, సుమారు 289 మంది రైతులకు ఈ పుస్తకాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఈనెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కావునా రైతులందరూ ఇబ్బందులు పడకుండా పుస్తకాలు తీసుకోవాలని సూచించారు. రీ-సర్వే డీటీ సరస్వతి, ఆర్ఐ జనార్ధన్‌రావు, వీఆర్వోలు నాగేష్, మల్లికార్జున, టీడీపీ నాయకులు గంగన్న, బసప్ప పాల్గొన్నారు.

## ఎపిడబ్ల్యుఎఫ్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎస్.ఐ



**గూడూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** గూడూరు మండల ఎపిడబ్ల్యుఎఫ్ యూనియన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను కె.నాగలాపురం ఎస్.ఐ అఖిలేష్ కుమార్ ఆవిష్కరించారు. జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిధిగా పనిచేసే పాత్రికేయ వృత్తి ఎంతో మహోన్నతమైందన్నారు. విలేఖరుల సమస్యలు ఎవైన ఉంటే వాటిపై తాను వెంటనేస్పందించి తోడ్పాడు నిస్తామన్నారు. స్థానిక పాత్రి కేయులు ఎపిడబ్ల్యుఎఫ్ మండలఅధ్యక్షులు దౌలత్‌ఖాన్,గౌరవఅధ్యక్షులు శరత్‌బాబు, కార్యదర్శులు మహబుబ్ భాషా,అబ్దుల్ లతీఫ్,గౌరవ సభ్యులు ఇస్మాయిల్, ఎర్రన్న, ఈసాక్ పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం



**ఆదోనిలీగల్, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త;** లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఈనెల 12వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె.అజయ్‌బాబు, ఐఎన్‌టీయూ నాయకులు దేవిశెట్టి ప్రకాష్ అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని పీఎస్ గోపాల్, బి.వెంకన్న, జి.వెంకప్ప అధ్యక్షతన నిర్వమించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను పున:రుద్ధరించాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. రవాణా రంగం, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. అసంఘటితరంగ కార్మికులకు జీవిత భద్రత కల్పించాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేట్ పెట్టుబడుల ఉపసంహరణను ఆపాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 12న చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు సంజయ్, డీఎస్ఎఫ్ నాయకులు ఉదయ్, సీఐటీయూ నాయకులు తిప్పన్న, లక్ష్మన్న, హనుమంతు, కృష్ణమూర్తి, ఏఐటీయూసీ ఓబీ నాగరాజు, బి.రాజు, భీమేష , గంగన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తాం

– రూ.38 లక్షలతో ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి భూమిపూజ



**దేవనకొండ, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త;** గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. సోమవవారరం మండల పరిధిలోని ఐరన్‌బండ బి.సెంటర్ గ్రామంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. హామీలను నెరవేరుస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, ఆలూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మల్లేపల్లి రంగడు, సహకార సొసైటీ చైర్మన్ రాజశేఖర్‌గౌడ్, మార్కెట్‌యార్డు డైరెక్టర సరోజ, టీడీపీ నాయకులు ఉచ్చీరప్ప, మల్లికార్జునగౌడ్, చిన్నరాముడు, నాగేష్, చాకలి లింగన్న, బడేసాబ్, రాజగోపాల్‌గౌడ్, జనసేన నాయకులు బంగి చంటిబాబు, లక్ష్మన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాఠశాల పూర్వపు విద్యార్థినికి ఘన సన్మానం



**రుద్రవరం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** మండలంలోని యల్లావత్తుల గ్రామానికి చెందిన విజయలక్ష్మీ గ్రూప్-2 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఏఎస్ఓగా పదవి సాధించిన సందర్భంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ చంద్రమోహన్ అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ మాట్లాడుతూ స్థానిక ఉన్నత పాఠశాలలో పదవతరగతి వరకు విజయలక్ష్మీ చదివిందన్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సహంతో విజయలక్ష్మీ గ్రూప్-2 పరీక్షలో అర్హత సాధించి ఫారెస్టు ఏఎస్‌వో అసిస్టెంట్ సహాయ విభాగ అధికారిగా ఎన్నిక కావడం ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు. రాబోయే రోజుల్లో విజయలక్ష్మీ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరుకుంటున్నామన్నారు. పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు మనోరంజన్ ప్రతాప్ చలమరేంజ్ అధికారి ఉదయ్‌దీప్, సెక్షన్ అధికారి కిశోర్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిత్తడి నేలలు పరిరక్షణపై అవగాహన



**రుద్రవరం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** చిత్తడి నేలలు వాటి పరిరక్షణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చలమ రేంజ్ అధికారి ఉదయ్ దీప్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని యల్లావత్తుల ఉన్నత పాఠశాలలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని గ్రామ సర్పంచ్ చంద్రమోహన్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిత్తడి నేలలు వాటి పరిరక్షణ పర్యావరణ వాతావరణ సమతుల్యతను ఎలా కాపాడుకోవాలన్న అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పశుసంవర్ధక ఉప సంచాలకులు మనోరంజన్ ప్రతాప్, హెచ్ఎం బాలకృష్ణ, సెక్షన్ అధికారి కిశోర్‌కుమార్, బీట్ ఆఫీసర్ రామారావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నెహ్రూనగర్ యువకుడికి గ్రూప్-I, గ్రూప్-2 ఉద్యోగాలు

: గ్రూపు -1 మళ్లీపరీక్షరాసి జిల్లా సబ్‌కలెక్టర్ అవుతా అశోక్‌కుమార్‌రెడ్డి



**పగిడ్యాల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం నెహ్రూనగర్‌కు చెందిన రైతు కట్టా బ్రహ్మానందరెడ్డి, నాగరత్నమ్మల దంపతుల కుమారుడు కట్టా అశోక్ కుమార్‌రెడ్డి " పువ్వుపుట్టగనే పరిమళించు " అనే చందంగా చిన్ననాటి నుండి చురుకుగా వుంటూ చదువులో తోటివిద్యార్థుల కన్నా బాగాచదివేవాడు. కట్టా అశోక్‌కుమార్‌రెడ్డి ఇటీవల విడుదలైన గ్రూపు -1, గ్రూపు-2లో రెండింటిలోను ఉద్యోగాలు సాధించారు. కట్టా అశోక్‌కుమార్‌రెడ్డి స్వగ్రామం నెహ్రూనగర్ జెడ్పీపాఠశాలలో 6వతరగతి నుండి 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో విద్యను అభ్యషించారు. 10వ తరగతిలో జిల్లాస్థాయిలో ఉత్తమమార్కులు సాధించారు. ఇంటర్మీడియెట్ ఎంపిసి నెల్లూరు నారాయణ కాలేజిలో చదివారు. 93 శాతం మార్కులతో జిల్లాస్థాయిలో ఉత్తమమార్కులు సాధించారు. కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసిఈ లో ప్రథమశ్రేణిలో ఉత్తర్ణులయ్యారు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటిలో ఎంటెక్ చేశారు. అనంతరం విజ్ఞాన యూనివర్శిటిలో అసిస్టెంట్ ప్రొపెసర్‌గా 7యేళ్ల పనిచేశారు. ఒక వైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు గ్రూపు-1, గ్రూపు -2 పై దృష్టిసారించి గ్రూపు-2లో ఎంపికై నంద్యాలలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా 5యేళ్లు పనిచేశారు. ఇటీవల ప్రకటించిన గ్రూపు -1, గ్రూపు -2 లో రెండింటిలోను ఉద్యోగాలు అశోక్‌కుమార్‌రెడ్డి సాధించారు. గ్రూపు-1లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా, గ్రూపు -2లో సబ్ రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యారు. 5యేళ్లుగా ప్రణాళికా బద్ధమైన కృషితో చదివి మూడవసారి ఈ ఫలితాలు సాధించానని అశోక్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. మాగ్రామంలో గ్రూపు -1లో ఆర్‌టిఓగా పురంధర్ 2012లో ఎంపికయ్యారు. ఆయనను స్పూర్తిగా తీసుకుని తాను గ్రూపు -1 ,సాధించాలనీ పట్టుదలతో చదివి ఎంపికయ్యాననీ, అయితే తన లక్ష్యం మాత్రం గ్రూపు -1 మళ్ళీపరీక్ష రాసి జిల్లా సబ్‌కలెక్టర్ కావాలనీ వుందనీ కట్టా అశోక్‌కుమార్‌రెడ్డి ఆశాభావంవ్యక్తం చేశారు. మీ కుటుంబంలో ఎవరైన ఉద్యోగాల్లో ఉన్నారా అని ప్రభాతవార్త ప్రశ్నించగా తమ సోదరీమణులు స్వాతి, స్వేత ఉన్నారు. స్వాతి వెల్ఫేర్ అసిస్టెంట్‌గా, స్వేత డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారనీ తెలిపారు. కట్టా అశోక్‌కుమార్‌రెడ్డి, నాగరత్నమ్మ దంపతులకు ముగ్గురు సంతానం అయితే ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో సంతోషం వ్యక్తం చేశారు.

## పింఛన్ కోసం టీడీపీ అఫీసు ఎదురుగా దివ్యాంగుడు



**కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎదురుగా సోమవారం వికలాంగుల సైకిల్‌పై ఉన్న అముల మద్దిలేటిని మండల టీడీపీ ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి కింద ఉన్న దివ్యాంగున్ని గుర్తించి మేడ మీద నుండి దిగి వచ్చి సమస్యను అడిగి తెలుసుకొని మీ సమస్యను మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి కొత్త పింఛన్లు మంజురైన వెంటనే మీకు కూడ మంజూరు చేయిస్తామని భుజం తట్టి హామి ఇచ్చారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు



**పాములపాడు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే తండ్రిపై కేసు నమోదుచేయడం జరుగుతుందని పాములపాడు ఎస్ఐ తిరుపాలు తెలిపారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని జాతీయ రహదారి రుద్రవరం టోల్‌గేట్ వద్ద ఎస ఐ తిరుపాలు వాహ నాల తనిఖీలు నిర్వహించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ వాహనాలు తీనిఖీచేశారు.ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహ నాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చిన కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రతివాహన డ్రైవర్ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాల్లో కుటుం బాలు వీధినపడుతున్నాయని అలాంటి పరిస్థితులులేకుండా ప్రతిడ్రైవర్ బాధ్యతగాడ్రైవింగ్ చేయాలన్నారు.

## స్క్రబ్ టైఫాస్ వ్యాధి ప్రాణాంతకం కాదు - డా.రఘు



**నందవరం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** స్క్రబ్ టైఫాస్‌వ్యాధి ప్రజలకు ప్రాణాంతకం వ్యాధి కాదని ఇది నల్లి కుట్టడం ద్వారా వస్తుందని సంచార చికిత్స కార్యక్రమ అధికారి డా.రఘు అన్నారు. సోమవారం మండల పరిధిలోని హాలహర్వి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడుతూ స్క్రబ్ టైఫాస్ వ్యాధి ప్రాణాంతకం కాదని ప్రజలు అందోళనచెందకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవ్యాధి నల్లి కీటకం కుడితే సోకుతుందని తెలిపారు. ఈకీటకం కుట్టి చోట ఎర్రటి మచ్చ కనిపించడం, ముఖ్యంగా పొలాలు, తోటలు గుబురు చెట్టు ఉన్న ప్రదేశాలకు వెళ్లె వారిలో ఎక్కువగా ఉంటుందన్నారు. పొలాలకు వెళ్లెవారు పొడవైన చెతులు ఉన్న దస్తులను, శరీరాన్ని పూర్తిగా కప్పి వుంచే దుస్తులు ధరించడం ద్వారా కీటకభారీ నుండి పడకుండా ఉండవచ్చన్నారు. కీటకం ద్వారా అధిక జ్వరం, చలి, తీవ్రమైన తలనొప్పి, కండరాలు నొప్పులు మరియు నల్లి కుట్టిన చోట నల్లటి మచ్చలు కనిపించడం ఇది డెంగ్యు, మలేరియా లక్షణాలను పోలి ఉంటుందన్నారు. అనుమానస్పద లక్షణాలు కనిపించిన వెంటనే సమీప, పట్టణ ప్రాథమిక ఆరోగ్య వైద్యులను సంప్రదించాలన్నారు. డా.విజయభారతి, ఆరోగ్యవిస్తరణాధికారి వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది మరియు ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

## చిత్తడి నేలలతో ఎంతో ఉపయోగాలు



**మహానంది, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** చిత్తడి నేలలతో ఎంతో ఉపయోగాలని డిప్యూటి రేంజ్ అధికారి హైమావతి తెలిపారు. సోమవారం మహానంది గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫీల్డ్ డైరెక్టర్ విజయ్‌కుమార్, డిఎఫ్ఓ అనురాగ్ మీనా, నంద్యాల రేంజ్ అధికారి జడ్ ఎన్ జాల అదేశాల మేరకు విద్యార్థులకు చిత్తడి నేలలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిత్తడి నేలల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ముఖ్యంగా స్పాంజీ ఏవిధంగా నీటిని పీలు ్చకొని నిలువ ఉంటుందో అదేవిధంగా చిత్తడి నేలలు నీటిని నిల్వ ఉంచుకుంటాయని విద్యార్థులకు తెలిపారు. ఇటీవల వేసవిలో కూడ నీటి ఎద్దడి ఉండదని పేర్కొన్నారు. మడ అడువులతో పాటు చిత్తడి నేలలు వరదలు సునామి నుండి రక్షిస్తాయన్నారు. వరదల సమయంలో వచ్చే నీటిని నిల్వ చేసుకుంటూ వరదప్రభావాన్ని తగ్గిస్తాయన్నారు. చిత్తడి నేలలు, చెరువులు, కుంట ల్లోని నీటిలో ఉన్న మురికిని కూడ తమలోఇమర్చుకుని స్వచ్ఛమైన నీటిని బయటకు పంపుతాయన్నారు. ఎఫ్ఎస్ఓ రామకృష్ణ, ఆశ్రమ పాఠశాల ఇంచార్జీ హెచ్ఎం హరికృష్ణ, ఉపాధా య్యులు, ఫారెస్టు బీట్ అఫీసర్ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న



**ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అని సమాజసేవకుడు నాగిరెడ్డి పల్లె అన్నెం నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం ఆళ్లగడ్డ మండల పరిధిలోని ఓబులం పల్లెలో యాచక కుటుంబాలకు అన్నం ప్యాకెట్లు పంపిణి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో భాగంగా అహోబిలం శ్రీలక్ష్మీనరసింహాస్వామి పార్వేట ఉత్సవాల సందర్భంగా యాచక కుటుంబాలకు అన్నం ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. మునుముందు మరెన్నోసేవా కార్యక్రమాల ద్వారా పేదలకు సహాయం అందిస్తామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఓబులేసు, బత్తులూరు వెంకటయ్య పాల్గొన్నారు.

## అంబటి రాంబాబు వాక్యాలకు నిరసనగా.. ధర్నా..



**డోన్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్ర మాజీ మంత్రి అంబటి రాంబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పై అనుచిత వ్యాఖ్యలు కు నిరసనగా సోమవారం పట్టణంలోని పట్టణ అధ్యక్షులు టీ రాఘవేంద్ర గౌడ్ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించి అంబటి రాంబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు ఈ సందర్భంగా రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ వలసల రామకృష్ణ శాలివాహన సంఘం డైరెక్టర్ సుధాకర్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, మాట్లాడుతూ మాజీ మంత్రి అంబటి రాంబాబు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవ్ పలికారు అనుచిత వ్యాఖ్యలు చేస్తే మాత్రం సహించే . ప్రసక్తే లేదని హెచ్చరించారు అనంతరం పాత బస్టాండ్ లో అంబటి రాంబాబు దిష్టిబొమ్మను వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి కోట్రికే పని రాజ్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన మాజీ ఎంపీపీ శేష్ పని గౌడ్ పెద్ద కేశవయ్య గౌడ్ సింగల్ విండో ప్రెసిడెంట్ శ్రీరాములు మిద్దిపల్లి గోవిందు దేవర బండ రాము పాల్గొన్నారు.

## రెవిన్యూ క్లినిక్ ద్వారా 272 అర్జీలు స్వీకరణ

– డిఆర్వో డి రాము నాయక్

**నంద్యాల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త ప్రతినిధి:** భూ సమస్యల పరిష్కారం కోసం రెవిన్యూ క్లినిక్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని వాటి ద్వారా 272 అర్జీలను స్వీకరించడం జరిగిందని డిఆర్వో రాము నాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ అవరణలో నిర్వహించిన రెవిన్యూ క్లినిక్ ద్వారా భూ సమస్యలకు సంబంధించిన ధరఖాస్తులను స్వీకరించడం జరిగిందన్నారు. డిఆర్వో మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కార నేపధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రెవిన్యూ క్లినిక్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటి ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. రెవిన్యూ క్లినిక్ ద్వారా మొత్తం 272 అర్జీలు స్వీకరించగా అందులో రెవిన్యూ, గ్రామ, వార్డు సచివాలయాల సేవలకు సంబంధించినవి 6 అడంగల్ సవరణకు సంబంధించినవి 72, చుక్కల భూముల క్రమబద్ధికరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 35, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సబంధించినవి 47, రెవిన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 64, దేవాదాయ వక్ఫ్ భూములకు సంబంధించినవి 20 ధరఖాస్తులు వచ్చాయన్నారు. స్వీకరించిన అన్ని అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో త్వరితగతిన పరిష్కరిస్తామని డిఆర్వో తెలిపారు.

## బాధ్యులపై చర్యలు తీసుకోండి

– వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి



**మంత్రాలయం, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త;** తిరుమల తిరుపతి దేవస్థానంలో కల్తీ నెయ్యి వాడారని వైసీపీ పార్టీపై నిరాధార ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సీఐ రామాంజులకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కల్తీ నెయ్యిపై కోర్టు వైసీపీకి అనుకూలంగా తీర్పునిచ్చినా కూడా కొంతమంది మీడియా, సోషల్ మీడియాలో వైసీపీ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నట్లు వెల్లడించారు. ఇలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీ లీగల్ అడ్వైజర్ గురురాజు, సర్పంచ్ భీమయ్య, నాయకులు కురువ మల్లికార్జున, లక్ష్మిరెడ్డి, రచ్చుమర్రి బొజ్జప్ప పాల్గొన్నారు.

## రైతు హక్కులను కాపాడిన నేత చంద్రబాబునాయుడు



**కౌతాళం రూరల్, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త;** రైతు హక్కులను కాపాడిన నేత సీఎం చంద్రబాబునాయుడు అని, రైతులకు రాజముద్రతో కూడిన నూతన పాసు పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టారని కర్నూలు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు చూడి ఉలిగయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అగసలదిన్నె గ్రామంలో కూటమి ప్రభ్వుం, ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఆదేశాల మేరకు రైతులకు రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత పాలకుల అసమర్థ పాలన వల్ల ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేసి రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. పొలాల సరిహద్దు రాళ్లపై, రైతుల పాసు పుస్తకాలపై జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోలను వేయించి రైతులను అన్నివిధాలా భయభ్రాంతులకు గురి చేశడన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ విధానంతో రైతులను మోసం చేశాడన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి రైతులకు నూతన రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను అందించడం జరిగిందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి వల్లూరి పట్టాభి, లక్కే గోవిందు, చంద్రన్న, శివ, మారెప్ప, శివ, గ్రామ నాయకులు నాగరాజుగౌడ్, గోవిందప్ప, వీరేష్ నాయక్, నాగరాజు, హనుమంతు, వెంకటేష్, మారెప్ప, చెన్నబసవ, సుధాకర్ పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో ఉద్యోగుల బకాయిలకు స్పష్టత ఇవ్వాలి

– మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను కలిసిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం



**నంద్యాల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించి పెండింగ్‌లోఉన్న వేల కోట్ల రూపాయల బకాయిల వేతన సవరణ, నాలుగు విడతల డిఏలు, సరెండర్ లీవులు తదితర ఆర్థి ప్రయోజనాలపై 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో స్పష్టమైన కేటాయింపులు చూపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపధ్యంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను సంఘ ప్రతినిధులు సోమవారం కలిశారు. ఇప్పటికే మంజూరైన బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని లేదా ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాన్ని బడ్జెట్ ద్వారా వెల్లడించాలని కోరారు. సిట్టింగ్ లేదా విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో పిఆర్సీ కమిషన్ ఏర్పాటు, మధ్యంతర భృతి మంజూరు, సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన విధానం (ఓపిఎస్) పునరుద్ధరణ అంశాలపై ఎన్నికల హామిలను అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైతే శాసనసభలో ప్రస్తావిస్తామని మంత్రి హామి ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా, మహిళా విభాగం, పెన్షనర్ల విభాగ ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మినరసింహాస్వామి పార్వేటలో గంగుల ప్రత్యేక పూజలు



**ఆళ్లగడ్డ ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** ఆళ్లగడ్డ పట్టణం లోని పలు వీధుల్లో అహోబిలం శ్రీలక్ష్మీనరసింహా స్వామి పార్వేట ఉత్సవాల పర్యటన కొనసాగు తుంది. సోమవారం స్థానిక పాతబస్టాండ్, ప్రతాప్ టాకీస్, టీబీ రోడ్డు, గోడౌన్ తదితర వీధుల్లో శ్రీలక్ష్మీనరసింహాస్వామి పార్వేటలోని ఉత్సవ మూర్తులకు భక్తులు పూలు, టెంకాయలు, కర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులు ప్రతాప్ టాకీస్ ప్రాంగణంలోకి రాగానే మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి కుమారుడు గంగుల ఫణి కృష్ణారెడ్డి వారి అనుచరులు స్వామివారికి ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగుల ఫణికృష్ణారెడ్డి మాట్లాడుతూ అహోబిలం శ్రీలక్ష్మీనరసింహాస్వామి వారి ఉత్సవం అనాదిగా వస్తున్న సాంప్రదాయం అన్నారు. ఇలాంటి సాంప్రదాయాలు ఏక్షేత్రంలో లేదని స్వయంగా దేవుడే భక్తులకు వద్దకు వచ్చి తమ వివాహానికి రమ్మని పిలువడం ఎంతో విశేషం అన్నారు. స్వామివారి రాకను పండుగవాతావరణంలో జరుపుకోవాలని ఆయన తెలిపారు.

## కొలనుభారతి హుండి ఆదాయం రూ.2.17 లక్షలు



**కొత్తపల్లె, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** కొత్తపల్లె మండలం శివపురం సమీపంలో నల్లమలలో వెలసిన కొలనుభారతీ క్షేత్రం కొలనుభారతీదేవి హుండి ఆదాయం రూ.2,17,635 లు ఆదాయం వచ్చినట్లు శ్రీశైలందేవస్థానం డిప్యూటి కమి షనర్ రమణమ్మ అన్నారు.సోమవారం కొలనుభారతి క్షేత్రం లో ఏఈవో ఫణీందర్ ప్రసాద్, హరిదాస్ ఆధ్వర్యంలో అమ్మవారి హుండి లెక్కింపు జరిగింది. డిప్యూటి కమిషనర్ రమణమ్మ మాట్లాడుతూ గతనెలల హుండి ఆదాయంలెక్కింపు చేయగా 10గ్రాముల బంగారు, 350గ్రాముల వెండి, రూ. 2,17,635లు అమ్మవారికి భక్తులు సమర్పించారన్నారు. ఈమొత్తాన్ని అమ్మవారి బ్యాంకు ఖాతాలో జమచేస్తా మన్నారు. ఆలయచైర్మన్ వెంకటనాయుడు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి,ఏసీపాండు రంగా రెడ్డి, ఈవో రామలింగారెడ్డి, సూపరింటెండెంట్ రాజశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబటి ఇంటిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయండి

**నంద్యాల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త ప్రతినిధి :** మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేసిన తెలుగు దేశం గుండాలపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ ఇష్తాకుబాషా, మున్సపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీదరు లు కోరారు. సోమవారము రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించగా నంద్యాల మాజీ యంయల్ఎ శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో తెలుగు దేశం గుండాలపై కేసు నమోదు చేయాలని పిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ తిరుపతి లడ్డూలో ఎలాంటి జంతు కొవ్వులేదని సిట్ బృందము తెల్చి చెప్పడముతో తెలుగు దేశం నాయకులను ప్రజలు చీదరించు కుంటున్నారని అనవసరముగా అంబటి రాంబాబును టార్గెట్ చేస్తే అయన ఇంటిపై దాడులు చేయిం చారని అరోపించారు. ఇలాంటి నాయకులను పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు.

## చిత్తడి నేలల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం



**రుద్రవరం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** చిత్తడి నేలల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్య క్రమం నిర్వహించినట్లు రుద్రవరం రేంజ్ అధికారి ముర్తుజావలి తెలిపారు. సోమవారం డీడీపీటీ అనురాగ్ మీనా నంద్యాల వారి ఉత్తర్వుల మేరకు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తడిభూములు మరియు సాంప్రదాయ జ్ఞానం సాంస్కృతిక వారసత్వాన్ని జరుపుకోవడం అనే ఇతివృత్తంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సబ్‌డిఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సమక్షంలో అహబిలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్తడి నేలల పరిరక్షణపై అవగాహన నిర్వహించారు. ఇందులో భాగంగా రేంజ్ ఆఫీసర్ మర్తుజా వలి మాట్లాడుతూ విద్యార్థులకు రాంసర్ కన్వెన్షన్ మరియు చిత్తడి నేలల పరిరక్షణ వాటి ప్రాముఖ్యత చిత్తడి నేలల ప్రభావం గురించి వివరించడం జరిగిందన్నారు. అటవీ పర్యావరణ వ్యవస్థలో నీటి సేకరణ నిర్మాణాల గురించి వివరించడం జరిగిందన్నారు. పర్యావరణ వ్యవస్థలో చిత్తడి నేలలు కిడ్నీలుగా అటవీ అవరణ వ్యవస్థ ఊరితిత్తులుగా వ్యవహారించి జీవనకోటికి ఎంతో మేలు కలిగిస్తాయన్నారు. నూతల సెక్షన్‌లోని నూతల నార్త్ బీట్‌లో గండ్లేరు రిజర్వాయర్‌లో విద్యార్థులకు విద్యాటూర్ నిర్వహించి నల్లమల ప్రాంతంలోని వృక్షజాలం, జంతుజాలం, అటవీ అగ్నిప్రమాదాల నివారణ వేసవికాలంలో అగ్ని ప్రమాదాల నివారణ మొదలగు కార్యకలాపాల గురించి వివరించారు. డిప్యూటి రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, సెక్షన్ ఆఫీసర్లు ముక్తర్‌బాష, రామకృష్ణ, రాణెమ్మ, బీట్ ఆఫీసర్లు నాగవుశేని, సురేంద్ర గౌడ్, నరసింహారెడ్డి, జెమ్స్ పాల్ అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను మెరుగైన రీతిలో పరిష్కరించాలి : డిఆర్వో

**నంద్యాల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త ప్రతినిధిః**
ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా స్వీకరించిన ధరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి స్థాయిలో వేగవంతంగా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా రెవిన్యూ అధికారి రామునాయక్ అధికారులను అదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ శేషన్న, జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి రామునాయక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తులను నాణ్యతతో వేగవంతంగా సంతృప్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుండి అందిన ప్రతి ధరఖాస్తును జవాబుదారితనంతో నిర్ణీత గడువులోగ పరిష్కరించాలన్నారు.



పీజీఆర్ఎస్ ధరఖాస్తులతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ధరఖాస్తులపై ప్రత్యేక దృష్టిసారించి ఆర్జీలను క్లియర్ చేయాలన్నారు. అందిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీలు బియాండ్ ఎస్ఎల్‌లోకి వెళ్లకుండా నిర్ధిష్టకాలపరిమితిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా సీ ్వకరించిన కొన్ని సమస్యలు బేతంచెర్ల మండలం బేతంచెర్ల గ్రామానికి చెందిన పి లక్ష్మన్న తన రేషన్‌కార్డులో తన భార్య కుమారుని నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని డిఆర్వోకు ధరఖాస్తు చేసుకున్నారు. నంద్యాల మండల మిట్నాల గ్రామానికి చెందిన ఎస్ నాగమహేశ్వర్‌రెడ్డి లేఅవుట్ రస్తా కోసం ఇచ్చిన స్థలంలో కొందరు ఇళ్లు కట్టుకున్నారని అందుకు తగిన చర్యలు తీసుకొని రస్తా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిఆర్వోకు ఆర్జీ సమర్పించారు. ఈకార్యక్రమంలో 114 మంది ఆర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి డిఆర్వోకు ఆర్జీలు సమర్పించారు. ఈసమస్యలన్ని నిర్ణీత గడువులోగ పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తు అదేశాలు జారీచేశారు.

# జగన్ పాదయాత్రపై.. టీడీపీలో వణుకు

**– వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి భూమా కిశోర్‌రెడ్డి**

**ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్తః**
వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టబోయే పాదయాత్ర పేరు వింటేనే తెలుగుదేశం పార్టీ నాయకులలో వణుకు పుడుతుందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిశోర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక తమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో జగన్ పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని ఇప్పుడు మరోసారి ఆయన ప్రజల్లోకి వస్తుండడంతో టీడీపీ నేతల్లో గుబులు మొదలైందని అందుకే కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ



అటవిక పాలన కొనసాగుతుందని వైసీపీ కార్యకర్తలపై దాడులు పెరిగిపోతున్నాయని అందోళన వ్యక్తం చేశారు. ఇదేమని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టు చేస్తున్నారన్నారు. అలాగే తిరుమల లడ్డులో కల్తీనెయ్యి విషయంపై సుప్రీంకోర్టు క్లిన్‌చిట్ ఇవ్వడంతో ఈరోజు మళ్లీ కొత్తగా దాడులకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ తమ అధినేత జగన్ పాదయాత్రపై విమర్శలుచేయడాన్ని తీవ్రంగా ఖండిచారు. ఆళ్లగడ్డలో రైతుల సమస్యలు గాలికొదిలేసి స్థానిక నాయకులు డైవర్షన్ పాలిటిక్ ్స చేస్తున్నారని ఉయ్యాలవాడలో రైతుల చెక్కుల పంపిణిలో గోల్మాల్ చేయాలని ప్రయత్నించారన్నారు. రా ష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఆరాచకాలకు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన అమలు చేయాల్సిన పరిస్థితి వచ్చేలా ఉందన్నారు. ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ మానుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు.

# ప్రతి ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం

**– నగరపాలక కమిషనర్ పి విశ్వనాథ్**



**కర్నూలు మున్సిపల్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్తః**
ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదుకు సత్వరమే పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి విశ్వనాథ్ అదేశించారు. సోమవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమీవేశ భవనంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాలకు సంబంధించి 29 ఆర్జీలు రాగ వాటిని చట్టపరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఆర్జీదారులకు హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహార్‌రెడ్డి, ప్రజారోగ్యాధికారి డా. నాగ శివప్రసాద్, టీడ్కో అధికారి పెంచలయ్య, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీచౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవంలో ఎమ్మెల్యే

**నందికొట్కూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:**



శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్‌చార్జ్ మాంద్ర శివానందరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మూడేళ్ళకు ఒకసారి జరిగే జ్యోతుల మహోత్సవం ఆదివారం అర్ధరాత్రి అత్యంత వైభవంగా ఏర్పాటు చేసిన జ్యోతులకు ప్రత్యేక పూజలు అనంతరం నిర్వాహాకుల ఇంటి నుండి భాజభజంత్రీలు, భజనలు, కోలాటంతో అమ్మవారి నామస్మరణతో పట్టణంలో ఊరేగింపుగా శ్రీశ్రీశ్రీచౌడేశ్వరిదేవి ఆలయం వద్దకు చేరుకొని ఆగ్నిగుండ నుండి ఆలయంలోకి ప్రైవేశించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు, 59 జ్యోతులు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహాకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహాకులు, భక్తులు పాల్గొన్నారు.

# పట్టణ ప్రజలకు సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

**: నూతన సిసి రోడ్డు నిర్మాణం పనులకు భూమి పూజ**
**: ఆత్మకూరు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ. రషీద్**

**ఆత్మకూరు ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**



సోమవారం పట్టణంలోని 16వ వార్డ్ పరిధిలో నూతన సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమి పూజ చేయడం జరిగిందని ఆత్మకూరు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ. రషీద్ తెలిపారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సిసి రోడ్లు డ్రైనేజీ కాలువలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు 15 వ ఫైనాన్స్ ఆర్థిక సంఘం నిధులతో రూ" 11,80,000 లతో సాయి బాబా గుడి నుంచి గోవింద రాజులు ఇంటి వరకు 120 మీటర్ల రోడ్డు ను శ్రీశైలం నియోజకవర్గంఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలియజేశారు కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఏ.ఈ. షహీర్, వర్క్ ఇన్స్పెక్టర్ రాజేష్ టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు

# సిఎం సహాయనిధి పేదలకు వరం

**ప్యాపిలి ఫిబ్రవరి 2ప్రభాతవార్త:**
పేదలకు ముఖ్యమంత్రి సహాయనిది ఒక వరమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన అక్షరాలా పది లక్షల ఎనభై వేల నాలుగు వందల ఇరవై ఆరు రూపాయల చెక్కులను సోమవారం లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదని పేర్కొన్నారు. పేదలకు కార్పొరేట్ ఆసుపత్రులలో నాణ్యమైన వైద్య సేవలను అందించడానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం పట్టణంలోని చెరువుల పైపులైను పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి, తొప్పెల శ్రీనివాసులు, రాజా నారాయణమూర్తి, ఖాజాపీర, ప్రసాద్ రెడ్డి, గొల్ల రామ్మోహన్, కొంగనపల్లి మధు, ఎస్కే వలి, పుల్లయ్య, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..



# వైసీపీ ప్రభుత్వం.. వచ్చే ప్రసక్తే లేదు

**ప్యాపిలి ఫిబ్రవరి 2ప్రభాతవార్త:**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉన్నంతవరకు వైసీపీ ప్రభుత్వం వచ్చే ప్రసక్తే లేదని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ మాజీ మంత్రి బుగ్గన నియోజకవర్గ ప్రజలు ఓడించినప్పటికి పిట్టకథలు మారడం లేదని ఎద్దేవా చేశారు. డోన్ ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించారు దానిపై రేకులు కూడ సరిగ్గా లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం టిడిపి ప్రభుత్వంలో అభివృద్ధి జరిగిందని, తాము వేసిన రోడ్లపై తార వేశారని పేర్కొన్నారు. మేము చేసినా అభివృద్ధిలో ప్రజలు గుర్తించి మళ్లీ మాకే ఓటు వేశారన్నారు. ప్రజలు మీ మాటలు నమ్మడం లేదని పిట్టకథలు మానుకోవాలని హితవు పలికారు. డోన్ లో అప్పులు తీసుకుని వచ్చి నిర్మించిన మార్కెట్లో కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి నిధులను తీసుకొచ్చి ప్రతి గ్రామానికి తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. కొత్తకోట గ్రామంలో టిడిపి ప్రభుత్వ హాయంలో మంజూరు చేసిన పారిశ్రామిక హబ్ ను ఎందుకు పూర్తి చేయలేదని



నిలదీశారు. డోన్ లో పాత ప్రభుత్వాసుపత్రిలో ఐదు కోట్ల రూపాయల నిధులతో డయాలిసిస్ కేంద్రాన్ని. ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధికి సహకరించాలని కోరారు..

# లడ్డు వివాదాన్ని డైవర్షన్ చేయడానికి.. దాడులు చేస్తున్న టిడిపి ప్రభుత్వం

**కర్నూలు అర్భన్ ఫిబ్రవరి2 ప్రభాతవార్త:**
నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ నందు కల్తీ నెయ్యి అంశంపై, (సిట్) చార్జ్ షీటు కు విరుద్ధంగా, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వై. వి. సుబ్బారెడ్డి మరియు భూమన కరుణాకర్ రెడ్డి ఫోటోలతో తప్పుడు, అపవాదులు కలిగిన పోస్టర్లు ఏర్పాటు చేసి ప్రజల్లో శాంతి, భద్రతలకు భంగం కలిగే విధంగా ప్రచారం చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ



వైయస్సార్‌సీపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని ర్నాభూపాల్ రెడ్డి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లడ్డు వివాదాన్ని డైవర్షన్ చేయడానికి టిడిపి గూండాలు వైఎస్సార్ సిపి నాయకులపై దాడులకు పాల్పడుతున్నారనీ, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వాటిని కప్పిపుచ్చుకోవడానికి కూటమి ప్రభుత్వం ఇటువంటి అటవిక పాలన చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఈ దాడులపై చర్యలు తీసుకోవాలని కాటసాని రాంభూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

# అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన.. ఎంఎల్ఏ గిత్త జయసూర్య

**పగిడ్యాల, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త**
అధికారులపై ఎంఎల్ఏ గిత్త జయసూర ్య అగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సిఎం సహాయనిధి పంపిణీ చేయడానికి వచ్చిన ఎంఎల్ఏ పగిడ్యాల తహాశీల్దార్ కార్యాలయం సందర్శించారు. పగిడ్యాల మండలానికి రూ.2కోట్లు అభివృద్ధికోసం నిదులు మంజూరు చేశామనీ, లక్ష్మాపురం, పగిడ్యాలలో పనులు ఎందుకు చేపట్టలేదనీ ఎందుకు నిర్లక్ష్యంవహిస్తున్నారనీ పిఆర్‌జెఈని ప్రశ్నిచారు. కుటుంట ఏకీకృతసర్వే పూర్తిచేయలేదా ఎందుకు చేయలేదనీ చేయనివారికి మెమోలు జారీ చేశా రాలేదా అనీ ఎంపిడిఓ సుమిత్రమ్మను ప్రశ్నించగా మెమోలు జారీచేశామనీ సమాధానం రాలేదనీ తెలిపారు. మారుమూల ప్రాంతమైన కొత్తపల్లె మండలంలో సాంకేతికపరమైన సమస్యలున్నా సర్వేబాగా చేస్తున్నారనీ, అన్ని సౌకర్యాలు ఉన్నా ఎందుకు ఎందుకుచేయడంలేదనీ అసహనం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది సమావేశం ఏర్పాటు చేయండి ఎపుడు చేస్తారో చెప్పండి తాను వస్తానన్నారు. పడమర ప్రాతకోట పంచాయతీ కార్యదర్శి పనులు చేసినా సంతాలు చేయడంలేదనీ, మీరు పనులు చేసినట్లు గ్యారంటీ ఏమిటనీ ప్రశ్నింస్తున్నారనీ సర్పంచ్ పిట్టల శేషమ్మ ఎంఎల్ఏ దృష్టికితెచ్చారు. సమస్యను పరిశీలించి పరిష్కరించమనీ ఎంపిడిఓకు ఎంఎల్ఏ అదేశాలు జారీచేశారు. ప్రాతకోటలో బోరింగ్‌ల మరమ్మత్తులు చేయించడానకి సంవత్సరం క్రితం సామాన్లు వచ్చినా మరమ్ముత్తుచేపట్టడంలేదనీ ఎంఎల్ఏకు తెలిపారు. మోరింగ్ మరమ్మత్తుచేయడానికి మెకానిక్ రూ.2వేలు



అడుతున్నారనీ సర్పంచ్ సమాధానం ఇచ్చారు. నీటిసమస్యతలెత్తకుండా రూ.3వేలు మెకానిక్ ఇచ్చి మరమ్మత్తుపనులు చేయించమనీ ఆర్‌డబ్ల్యూఎస్ జెఈని ఎంఎల్ఏ ఆదేశించారు. బీసిలకు స్మశానవాటిక లేక ఇబ్బందులకు గురవుతున్నారనీ, పొలం ఉన్నా సర్వేచేయమనీ చెప్పినా రెవెన్యూవారు చేయడంలేదనీ ఎంఎల్ఏకు సింగిల్‌విండో అధ్యక్షుడు దామోదరరెడ్డి తెలపడంతో సర్వేచేయించమనీ తహాశీల్దార్ శివరాముడును ఎంఎల్ఏ అదేశించారు. ఆంజనేయనగర్‌లో సిసి ఎవ్వరికితెలియకుండా బుక్‌కీపర్‌ను నియమించారనీ, రాజకీయాలు చేస్తున్నారనీ, బుక్‌కీపర్‌ను తొలగించాలనీ ఎంఎల్ఏ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎంఎల్ఏ బుక్‌కీపర్‌ను తొలగించి స్థానిక నాయకులు సూచనలమేరకు బుక్‌కీఫర్‌ను నియమించాలనీ ఎంఎల్ఏ గిత్త జయసూర్య ఆదేశించారు. ఆర్థిక ఇబ్బందులతో బాదపడుతున్న

**బాధితులకు ప్రభుత్వం సహాయం అందిస్తుంది – ఎంఎల్ఏ గిత్త జయసూర్య**

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న బాదితులకు కూటమి ప్రభుత్వం నుంచి తక్షణ సహాయం అదేలాకృషిచేస్తుందనీ ఎంఎల్ఏ గిత్త జయసూర్య అన్నారు. సోమవారం పగిడ్యాల మండలంలోని నెహ్రూనగర్, సంకిరేణిపల్లె, పగిడా ్యలలోని బాధితులకు రూ. 496941లక్షలు సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి నందికొట్కూరు నియోజకవర్గంలో 340మందికి రూ. 2,4,47, 59 కోట్లుఆర్థిక సహాయం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందించామనీ భవిషత్తులో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందేలా పాటుపడతామనీ ఎంఎల్ఏ జయసూర్య తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ శివరాముడు, ఎంపిడిఓ సుమిత్రమ్మ, డిప్యూటీ ఎంపిడిఓ రహీం, ఎంఈఓలు పి.సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, జెఈలు జావీద్, శివకుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు దామోదరరెడ్డి, టిడిపి నాయకులు పూల్యాల రాజశేఖరెడ్డి, మాదిరెడ్డి రామిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ,వెంకటస్వామి గౌడు, రమణగౌడు, ప్రభాకర్, పుల్యాల వాసురెడ్డి, మచ్చ శ్రీనివాసులు, వగిలి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా టిడిపి కార్యదర్శి సగినేల రమణ, పెద్ద ఎల్లయ్య, మూర్తుజావలి, రాముడు తెలుగు వెంకటేశ్వర్లు, యర్రం వెంకటరెడ్డి, మద్దిలేటి గౌడు, కొట్టం శంకర్, జెసిబి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజముద్రతో కూడిన భూ హక్కు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ

**– రైతుల ఆస్తిపాస్తులకు ప్రభుత్వం రక్ష**
**– పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి**

**గడివేముల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త;**
రైతుల ఆస్తిపాస్తులకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దుర్వేసి గ్రామంలో రాజముద్రతో కలిగిన భూ హక్కు పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో భూమే ప్రాణంగా బతికే రైతులకు భూ సమస్యలు లేకుండా చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 2026 నూతన సంవత్సరం కానుకగా రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను ఇవ్వడం జరిగిందన్నారు. రైతుల ముఖంలో ఆనందం వెల్లివిరిసిందన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశామన్నారు. గతంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రచార ఆర్భాటాల కోసం రైతుల పాసు పుస్తకాలపై, రైతు పొలాల్లోని సర్వే రాళ్లపై ఆయన బొమ్మను వేసుకుని వేల కోట్లను వృథా చేశాడన్నారు. ప్రచార ఆర్భాటాలకు దుర్వినియోగం చేసిన ప్రభుత్వ సొమ్మును గ్రామాల అభివృద్ధి కోసం వాడని అసమర్థ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని మండిపడ్డారు. రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేశం సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, మండలాధ్యక్షులు పంట దిలీప్‌కుమాం "రెడ్డి, పాణ్యం మార్కెట్ యార్డు చైర్మన్ అంగజాల గీత, దుర్వేసి కృష్ణయాదవ్, శ్రీనివాసయాదవ్, జనసేన నాయకులు ధరణి చంద్రమోహన్, రఫీ, పుల్లారెడ్డి, మండల తహసీల్దార్ వెంకటరమణ,



ఎంపీడీఓ వాసుదేవగుప్తా, ఐటీడీపీ బీటీఎస్ రాజు, సచివాలయ ఉద్యోగులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**– దుర్గాభోగేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి...**

మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపాన గల దక్షిణ కాశీగా పేరు పొందిన శ్రీశ్రీదుర్గా భోగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం శ్రీ దుర్గా సమేత భోగేశ్వరస్వామి వారిని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థా అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. శ్రీ దుర్గా భోగేశ్వర ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు అన్ని శాఖల అధికారులు ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సజావుగా నిర్వహించేలా ప్రణాళికలు రచించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ పంట రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేశం సత్యనారాయణరెడ్డి, ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కంది శ్రీనివాసులు, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ వాసుదేవగుప్తా, పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, గడివేముల ఎస్ఐ సీసీ నాగార్జునరెడ్డి, పెసరవాయి వడ్డు లక్ష్మీదేవి, ఆలయ అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, గిరిధర్‌శర్మ, ఆలయ సిబ్బంది రమణ, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నేడు సిద్దాపురం చెరువుకు ఎమ్మెల్యే, కలెక్టర్ రాక..



**: అభివృద్ధి పనులను సందర్శించనున్న ఎమ్మెల్యే బుడ్డా, కలెక్టర్ రాజకుమారి**
**: సిద్దాపురం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు**

**ఆత్మకూరు ఫిబ్రవరి 2 ప్రభాతవార్త**
మండల పరిధిలోని బుడ్డా వెంగళ రెడ్డి సాగర్ ప్రాజెక్ట్ సిద్దాపురం ఎత్తిపోతల పథకాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఎన్డీఏ కుటుంబ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఇప్పటికే అడుగులు ముందుకు పడ్డాయి. సిద్దాపురం ప్రాజెక్టు వద్ద పర్యాటకులను ఆకర్షించేందుకు అరకు తరహాలో నల్లమల చెంచుల జీవన విధానాన్ని ప్రతిబింబించేలా పర్యాటకుల విడిది కోసం కాటేజీ ల నిర్మాణం, అరుదైన వృక్షజాలాలతో ఎన్టీఆర్ స్మృతి వనం పేరుతో ఆహ్లాదకరమైన ఎకో పార్కు, చెరువులో బోటింగ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక ప్రణాళికలను ఏర్పాటు చేసుకొని సిద్దాపురం ఎత్తిపోతల పథకాన్ని సాగునీటి అవసరాలతో పాటు.. పర్యాటకంగా అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని పూనుకున్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే సిద్దాపురం ఎత్తిపోతల పథకం వద్ద కట్టపై నూతన మెటల్ రోడ్డు నిర్మాణం, కట్టపటిష్టం కోసం చర్యలు, స్మృతి వనం వెళ్లేందుకు రహదారి పనులు చేశారు. ఇప్పటికే ఈ పనుల పర్యవేక్షణను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పరిశీలించి తగు సూచనలు సలహాలు చేశారు. ఇందుకు సంబంధించి నేడు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తో కలిసి పర్యాటక శాఖ అధికారులతో నేడు సిద్దాపురం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి పనుల వేగవంతం చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి పర్యటన నేపథ్యంలో జల వనరుల శాఖ అధికారులు, పర్యాటకశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు ప్రతిష్ట ఏర్పాట్లు చేశారు.

# జిల్లాలో సంక్షేమ పలాలు, అబివృద్ది పలాలను మంత్రి దృష్టికి

**: బిజేపి అద్యక్షులు అబిరుచి మధు**



**నంద్యాల, పిబ్రవరి 2,ప్రభాతవార్త ప్రతినిధి :**
నంద్యాల జిల్లా ప్రజలు ఎదర్కొంటున వివిద సమస్యలు అలాగే అబివృద్ది పనుల గురించి జిల్లా బిజేపి అద్యక్షులు అబిరుచిమధు రాష్ట్ర న్యాయ ముస్లీం మైనార్టి శాఖ మంత్రి యన్‌యండి ఫరూక్ దృష్టితి తీసుకెళ్లారు. సోమవారము మద్యహ్నాము జిల్లా బిజేపి అద్యక్షులు అబిరుచి మధు న్యాయ ,ముస్లీంమైనార్టి శాఖ మంత్రి యన్‌యండి ఫరూక్‌ను స్థానిక రాజ్‌థియేటరులో మర్యాద పూర్వకముగా కలిశారు ఈసందర్భముగా మంత్రికి శాలువ కప్పి సన్మానించారు. అనంతరము ఇద్దరి మద్య సుదీర్గ మంతానాలు జరిగాయి. ముఖ్యంగా జిల్లా ప్రజల సమస్యలు, అలాగే సంక్షేమ,అబివృద్ది పలాలు గురించి ఇద్దరు కలిసి చర్చించారు. బిజేపి కూటిమిలో బాగము కాబట్టి మిత్ర పక్షాల మద్య సమన్వయాన్ని మరింత బలోపేతము చేస్తూ ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవాలని ఈ సమావేషములో చర్చించారు. జిల్లా అబివృద్ది ప్రజాసంక్షేమమే ప్రదాన లక్ష్యంగా ముందుకు సాగాలని ఇరువరు నేతలు అబిప్రాయ పడ్డారు. ఈకార్యక్రమములో బిజేపి నాయకులు, తెలుగు తమ్ముళ్ల పాల్గొన్నారు.

# శ్రీ ఉమామహేశ్వరకు వైభవంగా పల్లకి సేవ



**బనగానపల్లె ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**
మండలంలోని యాగంటి, శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి దేవస్థానం నందు సోమవారం సందర్భముగా స్వామిఅమ్మవార్ల పల్లకి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రదోషకాల ప్రత్యేక పూజలు అనంతరం శ్రీ స్వామి వార్ల ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి పల్లకి నందు కూర్చుండజేసి నంది మండపంలో ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీ ఉమామహేశ్వర స్వామి వార్లకు శాస్త్రోత్సంగా మరియు వైవోపేతంగా పల్లకి నిర్వహించారు. అనంతరం అక్కడికి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వణాధికారి డి.పాండురంగా రెడ్డి, ఆలయ చైర్మన్ బండి మోళీశ్వర రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేష్ రెడ్డి, అర్చకులు మహేష్ శర్మ సత్యనారాయణ శర్మ రాఘవేంద్ర శర్మ దేవేంద్ర శర్మ ప్రవీణ్ శర్మ లు ఆలయ సిబ్బంది రమేష్ బాబు ప్రసాద్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.